
క్లుప్తంగా

పీఎం కిసాన్ పథకానికి రైతులు నమోదు చేసుకోవాలి



నకరికల్లు: పీఎం కిసాన్ పథకానికి మండలంలోని రైతులందరూ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. స్థానిక రైతు సేవ కేంద్రం–1లో పొలం పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 8,864 మంది రైతులు పీఎం కిసాన్ పథకానికి అర్హత కలిగి ఉండగా మొత్తం 5,430 మంది ఇప్పటికే నమోదు చేసుకున్నట్లు తెలిపారు. 11 అంకెల ఫార్మర్ రిజిస్టర్ నంబర్‌ను ప్రతి రైతు పొందాలని సూచించారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నావడ్డీ పంట రుణాలు, ఈ పంట నమోదుకు, పంటలు ప్రభుత్వానికి విక్రయించడానికి, యంత్ర పరికరాలపై రాయితీలకు 11 అంకెల విశిష్ట నంబర్ ప్రతి రైతు పొంది ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ సుభాని, రైతులు పాల్గొన్నారు.

6న ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



గోళ్లపాడు(ముప్పాళ్ల): మండలంలోని గోళ్లపాడు గ్రామంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి 33వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 6వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా 4వ తేదీ తెల్లవారుజాము నుంచి ఆలయంలో హరేరామ అఖండ నామ సంకీర్తన ఏకాహం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 5న సకల నదీ జల, పంచామృత అభిషేకం, హనుమత్ వ్రతం అనంతరం తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు సీతారాముల కల్యాణం, రాత్రి రామచంద్ర స్వామి వారి మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరుగుతుందన్నారు. 6న హనుమద్దీక్ష విరమణ, సామూహిక ఆకుపూజలు, పొంగళ్ల సమర్పణ, సాయంత్రం హనుమత్ జ్యోతి దర్శనం, తిరునాళ్ల మహోత్సవం జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముప్పాళ్ళ వాసి మృతి



ఈపూరు (శావల్యాపురం): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఈపూరు ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు కథనం మేరకు మండలంలోని ముప్పాళ్ళ గ్రామానికి చెందిన పులుకూరి గోపిచంద్ (25) పొలం పనుల నిమిత్తం బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన మిర్చి కూలీలతో బయలుదేరిన వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో యువకుడుకి తీవ్ర గాయాలు అయ్యాయి. తక్షణమే స్థానికులు సమీపంలోని ముప్పాళ్ళ ఆరోగ్య కేంద్రం తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శవపంచనామా నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఉద్యాన పంటలకు రాయితీలు పెంపు



రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు రైతు సేవ కేంద్రంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. శిక్షణలో ఉద్యాన శాఖ శాస్త్రవేత్త ఎస్.నగేష్ మాట్లాడుతూ మిరప పంటలో చీడపీడల నివారణ, యాజమాన్యంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే విధానాలను రైతులకు వివరించారు. ఉద్యాన అధికారి నవీన్ మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీలు పెంచినట్లు తెలిపారు. పూల తోటలకు ఒక హెక్టారుకు రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు, హైబ్రీడ్ కూరగాయలకు రూ.20 వేల నుంచి రూ.24 వేలు, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.30 వేల నుంచి రూ.1 లక్ష, అరటి తోటలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా పామాయిల్ సాగుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు రమేష్, జెస్సీ, నవీన్‌చంద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

- సహజ సిద్ధంగా ప్రకృతిలో దొరికే కషాయాలతో సాగు
- రైతులకు, కొనుగోలుదారులకు కూడా మేలు



చల్లగుండ్ల వద్ద సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రం

నకరికల్లు: ఆరోగ్యం కావాలంటే ఆహారం మార్చుకోవాలని వైద్యులు చెబుతారు. కూరగాయలు, ఆకుకూరల సాగుకు క్రిమిసంహారకాలు వినియోగిస్తారని, అవి తింటే అనారోగ్యమని తెలిసినా ప్రత్యామ్నాయం లేక తినాల్సిన పరిస్థితి. మందులను పిచికారీ చేసి పండించిన ఆహార ఉత్పత్తులకు బదులుగా మందులు లేని ఉత్పత్తులు ఉంటే బావుండునని భావిస్తున్న వారికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తున్నారు. గతంలో జెడ్ బీఎన్ఎఫ్ పేరుతో అమలైన ప్రకృతి వ్యవసాయం ప్రస్తుతం ఏపీసీఎన్ఎఫ్ పేరుతో చేపడుతున్నారు. నకరికల్లు మండలంలో యూనిట్ ఇన్‌చార్జిలు చేరెడ్డి రామసుబ్బారెడ్డి, ఉప్పోతోళ్ల రేణుకలు ఐసీఆర్‌పీల సహకారంతో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ప్రకృతి ఉత్పత్తుల ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు.

ఉత్పత్తులు ఇవి

ఏటీఎం పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ సుమారు 20 రకాలకు పైగా కూరగాయలు, ఆకుకూరలు, తీగ, దుంప జాతి కూరగాయలను పండిస్తున్నారు కొందరు రైతులు. స్థానికంగా లభ్యమయ్యే గోంగూర, వంకాయ, బెండ, దొండలే కాక ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి దిగుమతి చేసుకునే ముల్లంగి, క్యారట్, బీట్‌రూట్, క్యాబేజి లాంటివీ సాగు చేస్తున్నారు. ఔత్సాహికులకు విక్రయిస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

వినియోగించే మందులు ఇవే

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న రైతులు భూమి గుల్లబారి వానపాములు వృద్ధి చెంది భూసారం పెరిగేందుకు జీవామృతం భూమిపై పారిస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలకు, దుంపల మొక్కలకు పురుగు సోకితే అగ్నాస్త్రం, తెగుళ్ల సోకితే పుల్లటిమజ్జిగ, పంట పెరుగుదలకు, అధిక ఉత్పత్తులకు కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం ఇలా ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే పదార్థాలను వినియోగించి నాణ్యమైన రసాయనాలు లేని ఉత్పత్తులను సాధిస్తూ ఆరోగ్యాన్ని పంచుతున్నారు.

ప్రతి సోమవారం స్టాల్

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ప్రతి సోమవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు స్టాల్ ఏర్పాటు చేస్తున్నారు. వారికి కావలసిన ఏర్పాట్లకు తహసీల్దార్ కె.పుల్లారావు సహకారం అందిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కావాలనుకునే వారు సోమవారం ఆసక్తిగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

ప్రతి వారం కొనుగోలు చేస్తా



ప్రకృతి ఉత్పత్తులు ఎలా పండిస్తారు. వాటి ప్రయోజనాలు తెలుసుకున్నాక ప్రతి వారం క్రమం తప్పకుండా కొనుగోలు చేస్తున్నాను. క్రిమి సంహారకాలు వినియోగించి పండించిన కూరగాయలు, ఆకుకూరలకు ప్రకృతి ఉత్పత్తులకు రుచి, నాణ్యతలో తేడా స్పష్టంగా కన్పిస్తుంది.

– షేక్ రహమాన్, ప్రకృతి ఉత్పత్తుల కొనుగోలుదారుడు

డిమాండ్ పెరుగుతోంది



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినేందుకు ప్రజల్లో ఆసక్తి బాగా పెరిగింది. మన ప్రాంతంలో పండించడం సాధ్యం కాని క్యారట్, బీట్‌రూట్ లాంటి దుంప కూరలను ప్రకృతి వ్యవసాయంలో పండించగలిగాను. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో భూసారం పెరగడం ద్వారా చీడపీడలు ఆశించకుండానే అన్ని రకాల దుంపజాతులు పండించగలుగుతున్నాం. స్టాల్ ఏర్పాటు చేసిన గంట వ్యవధిలోనే తెచ్చిన కూరగాయలన్నీ అయిపోతున్నాయి.

– చింతలచెరువు వెంకటరమణ, ఐసీఆర్‌పీ, మహిళా రైతు, నకరికల్లు

ఉచితంగా అవగాహన కల్పిస్తాం



ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి కలిగిన రైతులకు ఉచితంగా అవగాహన కల్పించి పంటలు పండించడంలో సహాయం అందిస్తాం. మన ప్రాంతంలో అరుదుగా పండించే క్యాబేజీ, కాలీఫ్లవర్ లాంటివి సైతం ప్రకృతి వ్యవసాయంలో సాధిస్తున్నాం. ముఖ్యంగా తక్కువ భూమి గల రైతులు ఏటీఎం పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తే ఏడాది మొత్తం ప్రతిరోజు ఆదాయం పొందవచ్చు. సరైన అవగాహన పెంచుకొని ప్రకృతి వ్యవసాయం చేస్తే రైతుకు, కొనుగోలుదారులకు, పర్యావరణానికీ మేలు జరుగుతుంది.

– చేరెడ్డి రామసుబ్బారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి, ఏపీసీఎన్ఎఫ్

ముల్లంగిని పండించగలిగా



ప్రకృతి వ్యవసాయంలో ఐసీఆర్‌పీగా పనిచేస్తూ స్వయంగా ప్రకృతి వ్యవసాయం చేసి నాణ్యమైన ఉత్పత్తులను పండిస్తున్నాను. మన రాష్ట్రంలో పండకపోవడంతో తెలంగాణ, ఉత్తరాది రాష్ట్రాల నుంచి దిగుబడి చేసుకునే ముల్లంగిని ప్రకృతి వ్యవసాయంలో స్వయంగా పండించగలగడం ఆనందంగా ఉంది. ప్రకృతి ఉత్పత్తుల కొనుగోలుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

– గణపవరపు రత్నకుమారి, ఐసీఆర్‌పీ, మహిళా రైతు, చల్లగుండ్ల

కమిషనర్ ఆనంద్‌కుమార్‌కు సత్కారం



సత్తెనపల్లి: పదోన్నతి పొంది గుంటూరు నగర పాలక సంస్థ నుంచి బదిలీపై వచ్చి సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.ఆనంద్‌కుమార్‌ను ఎస్సీ సెల్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు బండారు నాగరాజు, మాజీ కౌన్సిలర్, 8, 9 వార్డుల ప్రెసిడెంట్‌లు బలిజేపల్లి సురేష్, చిలక శ్యామ్, 16, 19 వార్డుల ప్రెసిడెంట్‌లు గోన జయాబాబు, చేవూరి జయరావు, 11వ వార్డు సెక్రటరీ చిలక గిప్సన్, ఎస్సీ సెల్ నాయకులు తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

క్రోసూరు: క్రోసూరు మండలంలో దొంగతనాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. క్రోసూరులో ఆదివారం రాత్రి వేర్వేరు వ్యక్తులకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలు ఇంటి బయట పెట్టుకున్నవి చోరీ జరిగినట్లు తెలిసింది. క్రోసూరు గ్రామంలోని శ్రీనివాసరెడ్డికి చెందిన షైన్, మద్ది విజయబాబుకు చెందిన యూనికాన్ వాహనాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిసింది. ఇటీవల ఎరువుల కొట్లో కూడా దొంగతనం జరిగినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. రెండు మాసాల క్రితం ఎర్రబాలెంలో వృద్ధురాలి ఇంట్లో దొంగతనం, దొడ్లేరు, పెరికపాడులో దొంగతనాలు చోటు చేసుకున్నాయి. దీనిపై పోలీసులు దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైకు ప్రచారం కూడా చేశారు. అయినప్పటికీ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రరావు తెలిపారు.

రెండు నెలలుగా లేని కందిపప్పు పంపిణీ

- ప్రభుత్వం ఇచ్చే కిలో కూడా సరఫరా లేక కార్డుదారుల అవస్థలు
- బయట మార్కెట్‌లో కిలో రూ.179కు కొనలేని పేదలు
- మండలంలో 20,080 రేషన్ కార్డులు



రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనం

క్రోసూరు: బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ పాలకులు పేదల జీవన ప్రమాణాలు పట్టించుకోవటం లేదు. ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ప్రజా పంపిణీ వ్యవస్థ కేవలం కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం, పంచదార పంపిణీ చేస్తూ మిగతా నిత్యావసర సరుకులు పంపిణీ చేయటం లేదు. అందులోనూ ముఖ్యంగా కందిపప్పు రెండు నెలలుగా మండలంలో పంపిణీ చేయటం లేదు. మండలంలో 20,080 రేషన్ కార్డులున్నాయి. వీటి ద్వారా కార్డుదారులకు కిలో కందిపప్పు రూ.67కు సరఫరా చేస్తారు. అయితే ప్రతి నెలా సక్రమంగా పంపిణీ చేయకపోవటంతో పేదలు బయట మార్కెట్లో కందిపప్పు కిలో రూ.179కి కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేయటం లేదని సివిల్ సప్లయిస్ అధికారులు తెలుపుతున్నారు. ఎన్నికల్లో పేదల ముంగిటకి స్వర్గాన్ని తీసుకొస్తామని హామీలిచ్చే పాలకులు కనీసం కందిపప్పు కూడా ఇవ్వలేక చేతులెత్తేయటం దుర్మార్గమని పేదలు వాపోతున్నారు. బయట మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు మండుతున్నాయి. వాటిని కొనలేక పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. రోజు కూలీ చేసుకునే పేదలు, కొద్దిపాటి వేతనాలతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పేదల గురించి ఆలోచించి నిత్యావసర సరుకులు ప్రతి నెల క్రమం తప్పకుండా అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు లారీలు ఢీకొని ముగ్గురికి గాయాలు



విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ



ప్రమాదంలో బోల్తాపడిన మిర్చి బస్తాల లారీ

నకరికల్లు: రెండు లారీలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలయిన ఘటన మండలంలోని నరసరావుపేట రోడ్డులోని చిలుకలూరిపేట మేజర్ సమీపంలో సోమవారం జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన రైతులు మిర్చిబస్తాలను తీసుకొని గుంటూరులోని మిర్చి యార్డుకు బయలుదేరారు. చిలుకలూరిపేట మేజర్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతివేగంగా గ్రానైట్‌తో వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో మిర్చిలోడుతో వస్తున్న లారీ బోల్తాపడి మిర్చి బస్తాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ క్రమంలో గ్రానైట్ లారీ ముందు భాగం నుజ్జునుజ్జవడంతో పాటు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. ప్రమాదంలో బొల్లాపల్లికి చెందిన లారీ డ్రైవర్ తోకల రాములు, మిర్చి రైతు మెతుకు శ్రీను అలాగే కర్ణాటకకు చెందిన మహదేవ సద్గురులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కితే ప్రమాదం



ప్రయాణికులను ఆపి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చల్లా సురేష్

నకరికల్లు: ఆటోల్లో మితిమీరి ఎక్కి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దని వ్యవసాయ కూలీలకు ఎస్ఐ చల్లా సురేష్ సూచించారు. వాహన తనిఖీల్లో భాగంగా స్థానిక అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై సోమవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు, మితిమీరి కూలీలను ఎక్కించుకొని వెళ్తున్న ఆటోలను నిలిపి కూలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాల్లో సంబంధిత పత్రాలు లేకుండా నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతాయని అన్నారు. అనాలోచితంగా వ్యవహరించి ప్రాణాల మీదకి తెచ్చుకొని జీవితాలు ఛిన్నాభిన్నం చేసుకోవద్దని హెచ్చరించారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు



అచ్చంపేట: స్థానిక రైస్ మిల్లులు, కిరాణా షాపులపై తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. బియ్యం టిక్కీ 25 కిలోలు ఉండవలసి ఉండగా 24 కిలోలే ఉండటంతో రెండు కిరాణా షాపులు, రెండు రైస్ మిల్లులపై కేసులు రాసినట్లు తూనికలు కొలతల జిల్లా కంట్రోలర్ అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేట్ కంట్రోలర్ మాధురి ఆదేశాల మేరకు తాము అన్ని షాపులు, రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టామన్నారు. ప్రతి షాపులో తూనికలు, కొలతలు కచ్చితంగా ఉండాలని, ఎలాంటి తేడాలున్నా ఉపేక్షించేది లేదని మిల్లు, షాపు యజమానులను హెచ్చరించారు. ఏడాదికి ఒకసారి తూనిక రాళ్లకు సీలు వేయించుకోవాలని, అదే విధంగా కొలతల లోటాలకు కూడా ముద్రలు వేయించుకోవాలన్నారు.

కమీషన్ ఏజెంట్ గుట్టు రట్టు



కాటాను పరిశీలిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారి జాన్‌సైదా

సత్తెనపల్లి: కమీషన్ ఏజెంట్ గుట్టును తూనికలు కొలతల శాఖ అధికారి షేక్ జాన్‌సైదా సోమవారం రట్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కట్టవారిపాలెం మెయిన్ రోడ్డు పక్కన గల పొగాకు పొలాల్లో రైతుల వద్ద నుంచి కమీషన్ ఏజెంట్లు పొగాకు కొనుగోలు చేస్తున్నారు. సోమవారం అటుగా వస్తున్న తూనికల కొలతల శాఖ అధికారి జాన్‌సైదా గమనించి కమీషన్ ఏజెంట్ల వద్ద ఉన్న కాటాలను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో కమీషన్ ఏజెంట్ల గుట్టు రట్టయ్యింది. రైతులను 10 కేజీలకు ఒకటి, రెండు కేజీల చొప్పున తూకంలో తేడా చూపిస్తూ కమీషన్ ఏజెంట్లు దగా చేయడాన్ని ఆయన గమనించారు. రిమోట్ కంట్రోల్ ద్వారా వేయింగ్ మిషన్‌లను ఆపరేట్ చేస్తున్నారని, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జాన్ సైదా హెచ్చరించారు. రైతులు ఎవ్వరూ మోసపోవద్దని ఏదైనా అనుమానం వస్తే వెంటనే తూనికలు కొలతల శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.



వేయింగ్ మిషన్‌ను ఆపరేట్ చేస్తున్న రిమోట్ లోపలి భాగం

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు



సీఎస్‌జీఎల్ఎం జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని సీఎస్‌జీఎల్ఎం జూనియర్ కళాశాల, అచ్చంపేట రోడ్‌లోని రైల్వే గేట్ వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్ వెనుక గల వాసవి జూనియర్ కళాశాల, బైపాస్ రోడ్‌లోని కృష్ణవేణి జూనియర్ కళాశాల, నాగార్జున నగర్‌లోని శ్రీ బాబా గురుదేవ్ కళాశాల, రఘురామ్‌నగర్ ఆర్సీఎం పాఠశాలలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోగా 8:30 గంటలకు లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతంగా సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్ పరీక్షలు

సత్తెనపల్లి: సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలికోన్నత పాఠశాలలో 189 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 163 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 177 మందికి గాను 165 మంది విద్యార్థులు హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను సర్వశిక్ష ఎడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వి.సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారి–1 ఏ శ్రీనివాసరావు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలకు 241 మంది విద్యార్థులు హాజరు

అచ్చంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రారంభమైన ఇంటర్ రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షకు 241 మంది విద్యార్థులు హాజరయ్యారు. అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల, క్రోసూరు మోడల్ కళాశాల, క్రోసూరు కేజీబీవీ కళాశాల, బొగ్గవరకు గురువయ్య జూనియర్ కళాశాలల నుంచి మొత్తం 243 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం దేశ్ అప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ (డీఏఎస్ఎఫ్) ద్వారా ఆరో తరగతి విద్యార్థులకు ప్రారంభమైన 'యాక్టిజెన్ క్లబ్'తో సిటిజన్‌షిప్ థీమ్‌లో 'డ్యూటీ బాండ్' అనే అంశంపై విద్యార్థులతో కృత్యాలు చేయించారు. ఈ యాక్టివిటీ ద్వారా విద్యార్థులు ఇంట్లో బాధ్యతలను పంచుకోవడమే కాకుండా సమాజంలో వారి విధులను, బాధ్యతలను కూడా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. సమాజంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను కాపాడటం వారి బాధ్యతని, అదేవిధంగా విధులను వారు ఎలా నిర్వర్తించాలో ఈ యాక్టివిటీలో వివిధ కృత్యాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస రెడ్డి, పీఏసీ చైర్మన్ జి.పున్నారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు



నకరికల్లు: సామాజిక అంశాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ చల్లా సురేష్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, పితృస్వామ్య సంప్రదాయలను సవాలు చేయడంలో పురుషులు పాల్గొనడం, ఆవశ్యకత అనే అంశంపై వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యసాధన వైపు పాఠశాల స్థాయి నుంచే దృష్టి సారించాలన్నారు. పురుషులకు సమానంగా అన్ని రంగాల్లోను ఎదగాలన్నారు. పుస్తక పఠనంతో పాటు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి రిమాండ్

సత్తెనపల్లి: హత్యాయత్నం కేసులో ఒకరికి న్యాయమూర్తి సోమవారం రిమాండ్ విధించారు. పట్టణానికి చెందిన తమ్మిశెట్టి ఆంజనేయులు తనపై హత్యాయత్నం జరిగిందని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దీనిలో బాధ్యుడైన ఎర్రసాని గోపిని సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.